క్లుప్తంగా

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వేల్పూర్: మండలంలోని లక్కోర గ్రామంలో శనివారం 'పల్లెపల్లెకు ఓబీసీ– ఇంటింటికీ బీజేపీ' వాల్‌పోస్టర్లను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు యమాద్రి భాస్కర్, డమాంకర్ శ్రీనివాస్, పోతుల బాలకిషన్, బాస గంగాధర్,పడిగెల రవి, రాగి ప్రభాకర్,గంగాధర్, సంతోష్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలి



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలనే ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని న్యాయవాదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రత్యేక జిల్లా కోసం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 104వ రోజుకు చేరాయి. దీక్షలో రుద్రూర్ మండలంలోని అంబం గ్రామానికి చెందిన యువకులు మహేష్, గంగాధర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



బోధన్: నేర నియంత్రణ, శాంతి భద్రతల రక్షణకు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బందికి చట్టాలపై అవగాహన ఉండాలని బోధన్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి సూచించారు. పట్టణంలోని కోర్టులో శనివారం డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులకు చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. మాదకద్రవ్యాల నిరోధక చట్టం, కోర్టు వెలువరించిన పలు ప్రతిష్ఠాత్మక తీర్పులను వివరించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమ్మయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలపై చిన్నచూపు



నవీపేట: మారుమూల గ్రామాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని బీఎల్‌ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండివెంకట్ ఆరోపించారు. మండలంలోని శాఖాపూర్ గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన బీఎల్‌ఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో తాగునీటి ఇబ్బందులు, పారిశుద్ధ్యలోపం, రహదారుల మరమ్మతులపై ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. సమస్యలపై యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జిల్లా కన్వీనర్ మధు, ప్రధాన కార్యదర్శి రాజేందర్, మండల నాయకులు శ్రీమాన్, గంగాధర్, దేవుబాయి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల అడ్డగింత

వర్ని: మండలంలోని సైదిపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింది నిర్మిస్తున్న రోడ్డు పనులు నాణ్యతగా లేవని, స్పిన్ వైబ్రేటర్ వాడటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తూ.. పనులను అడ్డుకున్నారు. పంచాయతీరాజ్ అధికారులు దగ్గరుండి నాణ్యతగా చేయించాల్సి ఉండగా అధికారులు పని దగ్గర లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

హైవే విస్తరణ బాధితుల సమావేశం



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో జాతీయ రహదారి(ఎన్‌హెచ్ 63) విస్తరణతో గృహ సముదాయాలు కోల్పోతున్న బాధితులు శనివారం సమావేశమయ్యారు. రోడ్డును ఇరువైపులా 75 అడుగుల చొప్పున విస్తరిస్తే తమ ఇళ్లకు పూర్తిగా నష్టం వాటిల్లుతుందని, బతుకులు రోడ్డున పడతాయని సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిని గ్రామం నుంచి కాకుండా గ్రామం బయటి నుంచి(బైపాస్ రోడ్డు) నిర్మించాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. సోమవారం అధికారులను కలిసి రోడ్డు విస్తరణకు సంబంధించి పూర్తి వివరాలను తెలుసుకొని కార్యాచరణ ప్రారంభిస్తామని నిర్ణయించారు.

అక్రమ కేసులు సరికాదు

ఎడపల్లి(బోధన్): మండలంలోని నెహ్రూనగర్ కాంగ్రెస్ నాయకుడు కాజాపైన అక్రమ కేసులు బనాయించి జైలుకు తరలించారని, ఇది సరికాదని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం కాజాను ఆయన పరామర్శించి, మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పనున్న తిప్పలు!

- పోచంపాడ్, సోన్‌పేట్ మధ్య కాకతీయ కాలువపై వంతెన నిర్మాణం
- శంకుస్థాపన చేసిన మంత్రి ప్రశాంత్‌రెడ్డి



మంత్రి శంకుస్థాపన చేసిన శిలాఫలకం



పోచంపాడ్, సోన్‌పేట్ గ్రామాల మధ్య కాకతీయ కాలువపై ఉన్న ఇరుకు వంతెన

బాల్కొండ : పోచంపాడ్, సోన్‌పేట్ గ్రామాల మధ్య కాకతీయ కాలువపై ఉన్న ఇరుకు వంతెనతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు తప్పనున్నాయి. కాలువ నిర్మాణ సమయంలో రెండు గ్రామాల ప్రజల రాకపోకల కోసం ఓ వంతెన నిర్మించారు. అది ఇరుకుగా ఉండటంతో రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం అక్కడ మరో వంతెన నిర్మాణానికి రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని 1.35 కోట్ల నిధులను మంజూరు చేయించారు. గురువారం శంకుస్థాపన చేశారు. దీంతో రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణం కోసం గతేడాది ఏప్రిల్ రూ.92 లక్షల నిధులు మంజూరయ్యాయి. కానీ వంతెన నిర్మించుటకు కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రాలేదు. దీంతో నాలుగు సార్లు టెండర్ పిలిచిన ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం మళ్లీ నిధులను రూ.1.35 కోట్లకు పెంచడంతో టెండర్ ప్రక్రియ పూర్తయింది.

కష్టాలు తీరుతాయి



కాకతీయ కాలువపై రెండు గ్రామాల మధ్య వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మంత్రికి రుణపడి ఉంటాం. దీంతో రెండు గ్రామాల ప్రజలకు రవాణా కష్టాలు తీరుతాయి.

– మిస్సా, సర్పంచ్, పోచంపాడ్

మంత్రికి కృతజ్ఞతలు



వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మంత్రి ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు. విద్యార్థులకు వంతెన నిర్మాణాంతో రాకపోకలు తిప్పలు తప్పుతాయి.

– గోలి ప్రకాశ్, సర్పంచ్, సోన్‌పేట్

రాహుల్‌గాంధీపై అనర్హత వేటు సరికాదు



ఎడపల్లిలోమాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



సాలూర మండల కేంద్రంలో..

నందిపేట్/మాక్లూర్/ఆర్మూర్‌టౌన్/బోధన్‌రూరల్/రెంజల్/వేల్పూర్/కమ్మర్‌పల్లి/భీమ్‌గల్/బాల్కొండ/చందూర్/ వర్ని/నవీపేట: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయడం, పార్లమెంట్‌లో అనర్హత వేటు వేయడం సరికాదని పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు శనివారం ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు విలేకర్ల సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ దేశంలో చేపట్టిన హాత్‌సేహాత్ జోడో యాత్రతో కల్గిన ప్రజాధరణను చూసి తట్టుకోలేక బీజేపీ ప్రభుత్వం రాహుల్‌పై అనర్హత వేటు వేసిందన్నారు. దేశంలో పెత్తందార్లకు, దోపిడిదారులకు బీజేపీ కొమ్ము కాస్తుందన్నారు. ప్రశ్నించిన వారిని ఇలా బహిష్కరణ చేసి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఎన్ని కుట్రలు చేసినా రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. సమావేశాల్లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గిడుగు గంగాధర్, రాంభూపాల్, జిల్లా కార్యదర్శి దేగాంగంగారెడ్డి, డెలికేట్ గంగాశంకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, ఎలమంచిలి శ్రీనివాసరావు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణు రాజు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీరడి భాగ్య, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ అంబర్ సింగ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామర్తి గోపి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విక్కీ యాదవ్, నరాల రత్నాకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో..



మోస్రా మండలకేంద్రంలో..

స్టేడియంలో సౌకర్యాలను కల్పించాలి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని మినీ స్టేడియం ఆవరణలో నిర్మించిన ఇండోర్ స్టేడియంలో సౌకర్యాలు కల్పించాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి, కౌన్సిలర్ జీవీ నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఇండోర్ స్టేడియంను శనివారం బీజేపీ నాయకులు సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండోర్ స్టేడియం అసాంఘీక కార్యాకలపాలకు నిలయంగా మారిందని, 2017లో నిర్మించిన స్టేడియం ప్రారంభించకముందే శిథిలావస్థకు చేరిందన్నారు. మినీ స్టేడియం, ఇండోర్ స్టేడియంకు కావాల్సిన సౌకర్యాలను వెంటనే ఏర్పాటుచేయాలని లేనిపక్షంలో ఇండోర్ స్టేడియం ముందు నిరాహార దీక్ష చేస్తామన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు అనిల్, నాయకులు ద్యాగ ఉదయ్, పల్లె శ్రీనివాస్, పోల్కం వేణు, భూసం ప్రతాప్, దోండి ప్రకాష్, భవాని నవీన్, బాసెట్టి రాజ్ కుమార్, పులి యుగంధర్, తోపారం పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.



ఇండోర్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

సీఎం నెరవేర్చని హామీలతో వెలసిన ఫ్లెక్సీలు



భీమ్‌గల్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ..

పెర్కిట్(ఆర్మూర్)/నందిపేట్(ఆర్మూర్) /మాక్లూర్ /బాల్కొండ/భీమ్‌గల్: జిల్లాలో ఫ్లెక్సీల వార్ కొనసాగుతోంది. డిచ్‌పల్లితో పాటు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం పసుపు బోర్డు ఏర్పాటుపై ఎంపీ అర్వింద్‌ను ఎద్దేవా చేస్తూ పసుపు రంగుతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయగా.. దీనికి ధీటుగా శనివారం ఆర్మూర్, నందిపేట్, బాల్కొండ, భీమ్‌గల్ సహా పలు మండలకేంద్రాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను సంధిస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. 'సీఎం గారు మాట ఇస్తే తల నరుక్కుంటాడు, కానీ ఇచ్చిన మాట తప్పడు', 'రైతులకు రూ.లక్ష రుణ మాఫీ', 'రైతులందరికి ఉచిత ఎరువులు ఇదిగో', 'నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఏది' అంటూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అలాగే ఎన్ఆర్ఐ సెల్, నిరుద్యోగ భృతి తదితర నెరవేర్చని హామీలను ఫ్లెక్సీలుగా ఏర్పాటుచేశారు. ఫ్లెక్సీలను గమనించిన ప్రజలు వింతగా చర్చించుకుంటున్నారు.





మాక్లూర్ మండల కేంద్రంలో.. నందిపేట మండల కేంద్రంలో..

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పెర్కిట్(ఆర్మూర్): పదో తరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఎంఈవో రాజ గంగారం శనివారం తెలిపారు. ఈ నెల 3నుంచి 13వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఆర్మూర్ పట్టణంతో పాటు మండలంలో 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 1,955 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఎంఈవో తెలిపారు.

బాల్కొండ మండలంలో..

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల్లో 'పది పరీక్షలకు' ఏర్పాట్లు పూర్తయినట్లు ఎంఈవో రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు మండలాల్లో సుమారు 1076 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

బోధన్ మండలంలో..

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలో 10, మండల పరిధిలో 3 పది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎంఈవో నాగ్‌నాథ్ తెలిపారు 13 పరీక్షా కేంద్రాల్లో 2,960 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో వసతులు ఏర్పాటు చేశామని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

టీఎస్పీఎస్సీ చైర్మన్‌ను పదవి నుంచి తొలగించాలి



నందిపేట్(ఆర్మూర్): పోటీ పరీక్షల పేపర్ లీకేజీ వ్యవహారంలో టీఎస్పీఎస్సీ చైర్మన్ నైతిక బాధ్యత చేస్తూ విధుల నుంచి తొలగించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సందగిరి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నందిపేటలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేపర్ల లీకేజీ వ్యవహారంలో మంత్రి కేటీఆర్ రోజుకొక మాట మాట్లాడుతూ సమస్యను పక్కదారి పట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. లీకేజీ ఘటనకు బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి రాజీనామ చేయాలని డిమాండు చేశారు. అభ్యర్థులకు రూ. లక్ష నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు మందుల బాలు, ఉపాధ్యక్షుడు నాగ సురేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- పంటలను తెగుళ్లు ఆశించే అవకాశం
- రుద్రూర్ కేవీకే శాస్త్రవేత్తలు

రుద్రూర్: జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వచ్చే ఐదు రోజుల్లో పొడి వాతావరణం నమోదవుతుందని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ వాతావరణ విభాగం శాస్త్రవేత్త శ్రీలక్ష్మి తెలిపారు. పగటి (గరిష్ట) ఉష్ణోగ్రతలు 38.7నుంచి 40.3 డిగ్రీల సెల్సియస్, రాత్రి (కనిష్ట) ఉష్ణోగ్రతలు 23.8 నుంచి 25.1 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉండవచ్చునని వివరించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున వరిలో మెడ విరుపు తెగులు తీవ్రత పెరిగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. దీని నివారణకు మాంకోజెబ్ +ట్రైసైక్లజోల్ 2.5గ్రా.(లేదా)పికాక్సిస్ట్రోబిన్+ట్రైసైక్లజోల్ 2మి.లీ. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. కూరగాయ పంటల్లో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉంది. దీని నివారణకు 0.2 గ్రా.ల థయోమిథాక్సం లేదా 0.2 గ్రా.ల అసిటామిప్రిడ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.



వరిలో మెడ విరుపు తెగులు

నీరు పెట్టాలి

కూరగాయ, పండ్ల తోటల్లో నీటి తడులు పెట్టుకోవాలి. నీటి తడులను ఉదయం, సాయంత్రం వేళల్లో పెట్టాలి. పండ్ల తోటల్లో నేలలో ఉన్నటువంటి తేమను సంరక్షించుకోవడానికి నేలపై పంట అవశేషాలు, ఎండు గడ్డి లేదా పాలిథిన్ షీట్‌లను కప్పి ఉంచాలి. పశువులకు దాణాతో పాటు లవణ మిశ్రమం, పుష్కలంగా తాగునీరు ఇవ్వడంతో బలహీన పడకుండా కాపాడవచ్చు. కోళ్ల వేడి వాతావరణాన్ని తట్టుకోవడానికి షెడ్లలో ఫ్యాన్లను, ఫాగర్స్‌ను అమర్చి షెడ్లపై వరి గడ్డితో కప్పి స్ప్రింక్లర్లను అమర్చాలి.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చందూర్‌లో చెక్కులు అందజేస్తున్న నాయకులు



చేపూర్‌లో..



బాల్కొండ మండల కేంద్రంలో..

వర్ని: చందూర్‌లో శనివారం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను సర్పంచ్ కర్లం సాయిరెడ్డి పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ ఏళ్లమల శేఖర్, చందూర్ సహకార సంఘం అధ్యక్షుడు పృరం అశోక్, పంచాయతీ కార్యదర్శి సాయిలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో పలువురు లబ్దిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కులను సర్పంచ్ ఇందూర్ సాయన్న అందజేశారు. ఉప సర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాల్కొండ: బాల్కొండ మండల పరిధిలోని పలువురు లబ్దిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను శనివారం ఎంపీపీ యమగంటి లావణ్య పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ శ్రీకాంత్, సర్పంచ్ బూస సునీత, తహసీల్దార్ వినోద్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి మొక్కను కాపాడుతాం



ఆర్మూర్‌టౌన్: హరితహారంలో నాటి ప్రతి మొక్కను కాపాడుతామని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో స్వచ్ఛోత్సవాల కార్యక్రమంలో భాగంగా సానిటేషన్‌పై ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నారు. అందులో భాగంగా శనివారం ఆర్మూర్ శివారు పెద్దమ్మ ఆలయ సమీపం నుంచి జాతీయ రహదారికి ఇరువైపులా నాటిన మొక్కల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారంను తొలగించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఎండిపోయిన మొక్కల చోట నూతన మొక్కలు నాటుతామన్నారు. పట్టణంలో పందుల, కోతుల, కుక్కల బెడదకు నివారణ చర్యలు చేపడుతామన్నారు. మున్సిపల్ డీఈ భూమేష, ఏఈ రఘు, సానిటేష్ ఎస్సై మహేష్, శభాజ్, సిబ్బంది ఉన్నారు.

పీఆర్సీ బకాయిలను చెల్లించండి

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపాలిటీలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు రావాల్సిన పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని ఇఫ్టూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు కార్మికులతో కలిసి శనివారం బల్దియ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఇఫ్టు జిల్లా కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు 2022 నుంచి పెంచిన పీఆర్సీని చెల్లిస్తున్నారని, 2021 జూన్ నుంచి డిసెంబర్ వరకు పెంచిన పీఆర్సీ బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు పర్వయ్య, లక్ష్మణ్, రాజు కార్మికులు ఉన్నారు.



ఔషధాల ధరల పెంపును విరమించుకోవాలి

ఆర్మూర్: కేంద్ర ప్రభుత్వం ఔషధాల ధరల పెంపును విరమించుకోవాలని సీపీఐఎంఎల్ రాంచంద్రన్ పార్టీ ఉత్తర తెలంగాణ కార్యదర్శి సుధాకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారం, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచిందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ప్రజలు ఆందోళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. పోరాటాల ద్వారానే పెరిగిన ధరలను తగ్గించగలమన్నారు.

ఆధ్యాత్మికం...

సత్యనారాయణ ఆలయ వార్షికోత్సవాలు

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్‌లోని రమా సత్య నారాయణ స్వామి ఆలయ అష్టమ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితుడు బల్యాపల్లి సుబ్బారావు గురుస్వామి వేద మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడురోజుల పాటు ఆలయంలో వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



సంక్షిప్తం

ఎన్ఎస్ఎస్ శిబిరం పరిశీలన

వేల్పూర్: మండలంలోని లక్కోర గ్రామంలో ఆర్మూర్ నరేంద్ర డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. గ్రామంలో విద్యార్థులు చేస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు.

'స్మైల్స్'లో గ్రాడ్యుయేషన్ డే

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్‌లోని స్మైల్స్ పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చిన్నారులు ఆటపాటలతో అలరించారు. అలాగే చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం పట్టాలను అందజేశారు.

ప్రభుత్వ బడుల్లో కరాటే శిక్షణ

బోధన్‌రూరల్(బోధన్): ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కరాటే శిక్షణ నిర్వహిస్తున్నారు. శనివారం మండలంలోని ఖండ్‌గావ్ ప్రాథమికోన్నత పాఠశాలలో కరాటే మాస్టర్ విద్యార్థులకుశిక్షణ అందించారు. ఎస్ఎంసీ చైర్మన్ శ్యామ్‌రావ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నియామకం..

బోధన్: మండలంలోని పెద్ద మావంది గ్రామానికి చెందిన కోట గోపాల్‌రెడ్డి టీటీడీపీ బోధన్ అసెంబ్లీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌గా నియామకమయ్యారు. ఈమేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ నియామక ఉత్తర్వులు జారీచేశారని శనివారం ఆయన తెలిపారు.

పింఛన్ల పంపిణీ

వర్ని: చందూర్‌లో ఐదుగురు లబ్ధిదారులకు శనివారం సర్పంచ్ కర్లం సాయిరెడ్డి నూతనంగా మంజూరైన వితంతు పింఛన్లను పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ ఏళ్లమల శేఖర్, చందూర్ సహకార సంఘం అధ్యక్షులు పృరం అశోక్, కార్యదర్శి సాయిలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

బాల్కొండ: మండల కేంద్రంలో శనివారం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఎంపీపీ లావణ్య అందజేశారు. ఈసందర్భంగా మంత్రి ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ఎంపీపీ శ్రీకాంత్, కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, సర్పంచ్ బూససునీత తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో హోసన్నా ర్యాలీ

వేల్పూర్: మండల కేంద్రంలో శనివారం మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హోసన్నా ర్యాలీ నిర్వహించారు. మట్టల ఆదివారం పురస్కరించుకొని కీర్తనలు పాడుతూ వీధులన్ని సంచరిస్తూ ఏసుక్రీస్తు ఔన్నత్యాన్ని ,ప్రేమ,కనికరం, క్షమాగుణము, మానవాళి కొరకు బలియాగము, పునరుద్ధానమును స్మరించుకున్నారు.

చలివేంద్రం ప్రారంభం

వేల్పూర్: మండల కేంద్రంలో సేవాభారతి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీసీసీబీ వైస్ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. సర్పంచ్ తీగెల రాధా మోహన్, సేవాభారతి సంస్థ సభ్యులు పాల్గొన్నారు

డైరెక్టర్ పదవికి రాజీనామా

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ సొసైటీ డైరెక్టర్ అంకన్నగారి రాజారెడ్డి అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు శనివారం వెల్లడించారు. తన రాజీనామా లేఖను జిల్లా సహకారశాఖ అధికారికి పంపినట్లు ఆయన తెలిపారు.